## తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి



ఉపాధ్యాయులు, విద్యార్థులతో సీఐ నరేశ్

మంచిర్యాల అర్బన్, జూన్ 18 : విద్యార్థులు బాగా చదివి తల్లితండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని మంచిర్యాల ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ సూచించారు. ప్రాఫిట్ షూ కంపెనీ సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రతీ జిల్లాస్థాయిలో పది పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, హెచ్ఎంలను గుర్తించారు. బుధవారం పట్టణంలోని ప్రాఫిట్ షూ కంపెనీ షోరూంలో వారిని సీఐ సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రాఫిట్ షూ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా కేసులో 9 మందిపై కేసు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మానవ అక్రమ రవాణా కేసులో 9 మందిని గుర్తించగా, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అమాయకులైన యువతులను మభ్య పెట్టి మధ్యప్రదేశ్‌కు అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఘటన బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. బుధవారం జిల్లా కేంద్రంలో డీఎస్పీ రామానుజన్, స్థానిక సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్‌తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాడిగొంది గ్రామానికి చెందిన యువతి యేడాది క్రితం తప్పిపోగా.. అప్పటి నుంచి ఆమె తండ్రి గాలిస్తున్నాడు. సదరు మహిళ గత నెలలో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయగా.. అది సొంతింటికి పోస్టులో వచ్చింది. కార్డుపై ఉన్న ఫోన్ నంబర్‌కు డయల్ చేయగా, మధ్యప్రదేశ్‌కు చెందినదని తెలియడంతో బాధితురాలి తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది తెలుసుకున్న జిల్లా కేంద్రంలోని మరో బాధితురాలు పోలీసులను కలిసి ఫిర్యాదు చేశాసింది. ఈ మేరకు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం అంగీకరించారు. మొత్తం 9మంది నిందితులను గుర్తించగా, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మొదటి యువతిని రూ.1.30 లక్షలకు అమ్మగా, రెండో యువతిని రూ.1.10లక్షలకు అమ్మివేశారు. 9 మంది నిందితుల్లో ఐదుగురు మహిళలు కాగా, నలుగురు పురుషులు ఉన్నారు. ఏ1గా మంచిర్యాలలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పరికిపండ్ల విజయలక్ష్మి, ఏ2గా జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌కు చెందిన సత్యంశెట్టి సుజాత, ఏ3గా రాజంపేటకు చెందిన పంచపుల, ఏ4గా వాంకిడి మండలం బెండరకు చెందిన తాడూరి ఉష, ఏ5గా సస్పెండ్ అయిన కానిస్టేబుల్ హరిదాస్, ఏ 6గా మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన దుర్గం సుధాకర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న మధ్యప్రదేశ్‌లోని జావ్రాకు చెందిన ఏ7 రమేశ్‌గౌడ్, ఏ8 సురేఖ, ఏ9 జగదీశ్ కోసం ప్రత్యేక బృందం మధ్యప్రదేశ్ వెళ్లినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైక్, మొబైల్ ఫోన్లు, రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బాధిత మహిళలు ఇద్దరు ఎస్టీలు కావడంతో ఎస్సీ, ఎస్టీతోపాటు, మానవ అక్రమ రవాణా, లైంగిక నేరాలు, అనైతిక నేరాల కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి వేదిక

లక్షెట్టిపేట, జూన్ 18 : విద్యుత్ వినియోగదారులకు న్యాయమైన విద్యుత్ సేవలు అందేలా చూడడంతోపాటు, వారి సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక పనిచేస్తున్నదని వేదిక చైర్మన్ ఈ నారాయణ తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్–2, నిజామాబాద్) నిర్వహించారు. జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన వినియోగదారులు సదస్సులో పాల్గొన్నారు. టెక్నికల్ సభ్యుడు ఎస్ రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యుడు లకావత్ కిషన్, ఇండిపెండెంట్ సభ్యుడు మర్రిపల్లి రాజాగౌడ్, ఎస్ఈ గంగాధర్, డీఈ ఎండీ ఖాయదర్, ఏడీ ఈ ప్రభాకర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం ఏఈలు గణేశ్, బాపు, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, VIJAY TULSYAN S/o. MADANLAL TULSYAN R/o. H.No.7-1-19, Dwaraka nagar, Adilabad is hereby Declare that, Hence forth be known as "TULSYAN VIJAY KUMAR" As per my all Related Documents holding Passport No. U6736842 Dt.02.03.2020 to 01.03.2030. Issued at Hyderabad, Hence Declared.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# గౌరవం, భద్రత కోసం 'సామాజిక భద్రత పింఛన్'



నస్పూర్ : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 18 : సమాజంలో గౌరవం, సామాజిక భద్రత అందించడంతో పాటు, రోజువారీ కనీస అవసరాలను తీర్చేందుకు సామాజిక భద్రత పథకం అమలు చేస్తున్నటుల మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం చేయూత పింఛన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్, ఫైలేరియా, వితంతువులు, దివ్యాంగ, నేత కార్మికులు, కల్లుగీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళల అవసరాలు తీర్చేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. 7.5 ఎకరాల కంటే ఎక్కువ భూములు కలిగిన, వైద్యులు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పింఛన్ పొందుతున్న, వార్షికాదాయం కంటే అధికంగా కలిగన వారు అర్హులు కాదని వెల్లడించారు. అలాగే రేషన్‌కార్డు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. సెర్ప్ సంచాలకులు గోపాల్‌రావు, డీఆర్డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి, అధికారులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, జూన్ 18 : భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తాలో గల ప్రభుత్వ భవనంలో, వెంకట్రావుపేటలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి సందర్శించారు. దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలలను సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భీమిని, జూన్ 18 : భీమిని మండలంలోని తంగళ్లపల్లిలో భూ భారతి గ్రామసభను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సందర్శించారు. 603 ఎకరాల భూములను తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటన్నామని, వీటికి సంబంధించి దహెగాం మండలంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రికార్డులు కాలిపోవడంతో ఆధారాలు లేవని రైతులు తెలిపారు. ప్రభుత్వం నుంచే వచ్చే సహాయాన్ని పొందలేకపోతున్నామన్నారు. భూముల్లో పట్టాదారు ఒకరుంటే మోకాపై ఇంకొకరు ఉన్నారని, ఈ విషయాన్ని అధికారులు చూడకుండా సర్వే నిర్వహించి ఇతరులకు పాసు పుస్తకాలు అందించి చేతులు దులుపుకున్నారని వివరించారు. మళ్లీ రెవెన్యూ అధికారులు సర్వే చేసినా సంబంధంలేని వ్యక్తులకు పట్టాదారు పుస్తకాలు మంజూరు చేశారని తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందవద్దని, గతంలో చేసిన సర్వే ఆధారంగా గ్రామసభ నిర్వహించి, అర్హులకు పాసు పుస్తకాలు అందిస్తామని తెలిపారు. తహసీల్దార్ బికర్ణదాస్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, ఆర్ఐ వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్లు తిరుమల, శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాలు జరుగకుండా అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి మాదకద్రవ్యాల నివారణపై పోలీస్, రెవెన్యూ, సంక్షేమ, విద్య, వైద్య ఆరోగ్య, రవాణా, గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, అటవీ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాలు విక్రయించిన, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయి సాగు చేయకుండా అధికారులు పర్యవేక్షించాలని, ఎవరైనా చేస్తే వారికి ప్రభుత్వ పరంగా లభించే పథకాలను రద్దు చేయాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, విద్యాసంస్థల పరిసరాల్లోని కిరాణా దుకాణాలు, పాన్ టేలాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయాలని, ఆటో, లారీ డ్రైవర్లు, కూలీలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 26న అంతర్జాతీయ డ్రగ్స్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, మహిళా సంఘాలతో ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించాలని, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. వచ్చే 2 నెలల్లో పోలీస్ కళాజాత బృందంతో జిల్లాలలో ప్రతి సోమ, గురువారాల్లో మాదకద్రవ్యాల నిర్మూలనపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించినా, వినియోగించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా రవాణా అధికారి రాం చందర్, జిల్లా మాధ్యమిక అధికారి కళ్యాణి, వ్యవసాయ, విద్య, ఆబ్కారీ, జాతీయ రహదారులు, డ్రగ్స్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్లపై అవగాహన**

చేయూత పింఛన్ పొందే ప్రతీ లబ్ధిదారుడిపై పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సెర్ప్ డైరెక్టర్ గోపాల్ రావులతో కలిసి అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని, ప్రతి పథకంలో వారి భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. చేయూత పింఛన్ ప్రతీ లబ్ధిదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2025 కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ హుస్సేన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆకెనపల్లి శివారులో భూ వివాదం

- ఇరు వర్గాల మధ్య దాడులు
- పలువురికి తీవ్రగాయాలు.. కేసు

కాసిపేట, జూన్ 18 : బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులో భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాల మధ్య దాడుల్లో పలువురికి గాయాలయ్యాయి. తెలిసిన వివరాల ప్రకారం.. ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 64లోని భూ విషయంలో పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన పనాస గణేశ్, సింగతి హైమావతి కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకున్నది. భూమిని గణేశ్ కుటుంబ సభ్యులు దున్నుతుండగా, హైమావతి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పెరిగింది. ఇరు వర్గాలు రోడ్డుపైనే తీవ్రస్థాయిలో దాడులు చేసుకున్నారు. పలువురికి తీవ్రగాయాలవగా, దవాఖానకు తరలించారు. ఇరువురు ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు కుటుంబ సభ్యులపైన కేసులు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లగురిజాల పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆకెనపల్లి, పాత బెల్లంపల్లిలో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రామాల శివార్లలో జరుగుతున్న వివాదాలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. గతం నుంచి ఉన్న వివాదాలు తారాస్థాయికి చేరడంతో దాడుల వరకు వెళ్లింది. దీంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణ లేకుండా పోయింది.

## భూ తగాదాలో ఇరు వర్గాలపై కేసు

చింతలమానేపల్లి, జూన్ 18 : బాలాజీ అనుకోడ శివారులో బుధవా రం జరిగిన భూ తగాదా ఘటనలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాథోడ్ మను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైతు వేదిక సమీపంలో ఉన్న ఓ భూమిలో కొన్ని నెలలుగా భూ వివాదం సాగుతున్నది. ఈ క్రమంలో బాలాజీ అనుకోడకు చెందిన కాంబ్లే పాప య్య (ప్రేమ్ కుమార్), అతడి కుటుంబ సభ్యులు ఈ నెల 12న పత్తి విత్తనాలు నాటారు. కాగా, ఈ భూమి తమదేనంటూ అదే భూమిలో కౌటాల మండలం యపల్‌గూడ గ్రామానికి చెందిన కామ్రే శంకరయ్య, అతడి కుటుంబ సభ్యులు పత్తి విత్తనాలు నాటే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పాపయ్య, అతడి కటుంబ సభ్యులు అక్కకికు చేరుకొని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి, దాడులకు దారితీసింది. పాపయ్యపై యాపల్ గూడకి చెందిన కామ్రే కమల్ కర్రతో దాడి చేశాడు. దీంతో పాపయ్య తలకు గాయమైంది. ఇదే సమయంలో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కాంబ్లే కరుణ, కామ్రే మేఘన ఒకరి కుటుంబాలపై ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యాపల్ గూడకు చెందిన కామ్రే శంకరయ్య, కామ్రే కమల్, కామ్రే రాజ్‌కుమార్, కామ్రే పున్నుబాయి, రత్నం సోము, కామ్రే పున్నుబాయి, బాలాజీ అనుకోడకు చెందిన కామ్రే ప్రేమ్ సాగర్, కామ్రే వందన, కామ్రే హర్షవర్ధన్, కామ్రే జ్ఞాన కిరణ్, కాంబ్లే కరుణ, విమలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు

నస్పూర్, జూన్ 18 : ప్రధానమంత్రి ధర్తీ అభా జనభాగీదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొదటి విడుతగా 500 మంది గల గ్రామాలు, 50 శాతం గిరిజన జనాభా గల 7 మండలాల్లోని 11 గ్రామాలను ఎంపిక చేసి, రాబోయే 5 ఏళ్లకు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 19న కాసిపేట మండలం వెంకటాపూర్‌లో, నెన్నెల మండలం జంగల్‌పేటలో, 20న కాసిపేట మండలం పల్లంగూడ, నెన్నెల మండలం కొత్తూరు, జన్నారం మండలంలోని కొత్తపేటలో, 21న భీమారం మండలం బూరుగుపల్లిలో, దండేపల్లి మండలం లింగాపూర్‌లో, 23న హాజీపూర్ మండలం నాగారంలో కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

## ఆంగ్లంపై పట్టు కోసం ప్రీ ప్రైమరీ తరగతులు

దహెగాం, జూన్ 18 : చిన్నారుల్లో ఆంగ్ల విద్యపై పట్టు పెంచేందుకు ప్రీ ప్రైమరీ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్–2 ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈవో చెరుకుపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇట్యాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు శాస్త్రోతంగా అక్షరాభ్యాసం నిర్వహించారు. మూడేళ్ల పిల్లలను పిల్లను ఈ తరగతుల్లో చేర్చుకొని నాలుగేళ్ల వరకు ఆంగ్ల విద్యపై వివిధ పద్ధతుల్లో బోధించనున్నట్లు తెలిపారు. కుర్షిద్‌బేగం, వీరశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

సీసీసీ నస్పూర్, జూన్ 18 : శ్రీరాంపూర్ ఏరియాకు కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులను బుధవారం టీబీజీకేస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఐఈడీ ఇంజనీర్ రాజన్న, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ విజయ్‌కుమార్‌ను ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆధ్వర్యంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి సన్మానించారు. నాయకులు లాలా, సుధాకర్, సంతోష్, పాదం శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరావు, అన్వేష్, శ్రీనివాస్, అనిరుధ్, వినయ్, రామారావు, సాయికుమార్, శ్యామ్ యాదవ్, కుమారస్వామి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, జూన్ 18 : రోడ్డు ప్రమాదంలో గాయపడి, రామకృష్ణాపూర్ ఏరియాదవాఖానలో చికిత్స పొందుతున్న గడ్డం రంజిత్‌ను బుధవారం టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పరామర్శించారు. నైట్ షిఫ్ట్ విధులకు బైక్‌పై వస్తున్న రంజిత్, శ్రీరాంపూర్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై, ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి తీగల వెంకటరెడ్డి, నాయకులు జంగా తిరుపతి రెడ్డి, కుష్నపల్లి సురేశ్, కిరణ్ పాల్గొన్నారు.

**బదిలీ అధికారులకు సన్మానం**

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ నుంచి మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్‌ను టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రమేశ్, నాయకులు సన్మానించారు. పిట్ సెక్రటరీ సుధాకర్, నాయకులు సారన్న, మెకానికల్ ఫోర్‌మన్ నిఖిల్‌కుమార్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రమేశ్, సంపత్‌కుమార్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, క్రాంతి పాల్గొన్నారు.

## మంచినీరు సరఫరా చేయాలి

రెబ్బెన, జూన్ 18 : బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్ షిప్ కార్మిక కాలనీల్లో సింగరేణి యాజమాన్యం కొత్తగా వేసిన బోరు నుంచినిరంతరం మంచినీరు సరఫరాచేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు కోరారు. గోలేటిలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. గోలేటి–1 అండర్ గ్రౌండ్ గని నుంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపి వేసి, కొత్తగా వేసిన బోరు ద్వారానే నీటిని కార్మిక కాలనీలకు అందించాలన్నారు. గతంలో టీబీజీకేఎస్ సింగరేణి యాజమాన్యం దృష్టికి నీటి సమస్య తీసుకవెళ్లగా, మిషన్ భగీరథ నీటిని అందిస్తామని చెప్పి, ప్రయత్నాలు చేసినా విఫలమైనటుల పేర్కొన్నారు. టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరీ ఓరం కిరణ్ ఉన్నారు.

## జోడేఘాట్ బస్సు పునః ప్రారంభం

కెరమెరి, జూన్ 18 : కెరమెరి మండలంలోని కుమ్రం భీం పోరాట గ్రామాలకు అధికారులు రవాణ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. కొద్ది నెలలుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో మళ్లీ జోడేఘాట్‌కు రవాణా సౌకర్యం కల్పించాలని భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ గ్రామస్తులతో కలిసి కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు, ఆసిఫాబాద్ నుంచి కెరమెరి, హట్టి మీదుగా జోడేఘాట్ వరకు ఆర్టీసీ బస్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసులు నాయకులు, ప్రజలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆన్‌లైన్ ప్రవేశాలకు నోటిఫికేషన్

కాగజ్‌నగర్, జూన్ 18 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ డిగ్రీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత, తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఓపెన్ డిగ్రీ బీఏ, బీకం, బీఎస్సీలో ప్రవేశబులు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 13వ తేదీలోగా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని, రెండు జిరాక్స్ కాపీలు కాలేజీలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 91601 44943, 94943 14314, 98663 98678 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఎస్టీపీపీ ఏజీఎం బాధ్యతలు

జైపూర్, జూన్ 18 : ఎస్టీపీపీ ఏజీఎం(ఈఅండ్ఎం)గా ఎం నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈఅండ్ఎం చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జైన్‌సింగ్, అధికారులు శివప్రసాద్, మధన్‌మోహన్, అధికారులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

తిర్యాణి, జూన్ 18 : పీఎం జుగా పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం కో–ఆర్డీనేటర్ వెడ్మ యస్వంత్‌రావు, ఎంపీడీవో వేముల మల్లేశ్ సూచించారు. మండలంలోని గంభీరావుపేట, ఏదులపాడ్ గిరిజన గ్రామాల్లో బుధవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి సాగర్, సీఎఫ్ఎల్ కార్యకర్తలు గున్నాల శ్రీకాంత్ గౌడ్, నాగపురి వనిజారాణి, ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదు పెంచాలి

లక్షెట్టిపేట, జూన్ 18 : పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని మంచిర్యాల డీఈవో యాదయ్య పేర్కొన్నారు. జడ్పీ ఉన్నత, ఉర్దూ మీడియం పాఠశాలలో బుధవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్య త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, పాఠశాల హెచ్ఎం శోభారా ణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దండేపల్లి కేజీబీవీ సందర్శన**

దండేపల్లి, జూన్ 18 : దండేపల్లి కేజీబీవీని డీఈవో యాదయ్య ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో భోజనం ఎలా ఉందని, బోధన సక్రమంగా జరుగుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయ ప్రత్యేకాధికారి మంజుల, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటపల్లి, జూన్ 18 : కోటపల్లి మండలం ప్రాణహిత నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేసి, పట్టుకున్నట్లు వివరించారు. ఇసుకను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మందమర్రి, జూన్ 18 : స్వయం సహాయక సంఘాల మహిళలు సొంత ఉపాధి, ఉత్పత్తుల తయారీతో ఆర్థికాభివృద్ధి సాధించాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను ఆయన ప్రారంభించారు. మెప్మా టీఎంసీ రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ కృష్ణప్రసాద్, డీఈ సుమతి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరాజు, వసంత్, రాజ్‌కుమార్, ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

హాజీపూర్, జూన్ 18 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) అనుబంధ సంఘంగా మంచిర్యాల జిల్లా పశు సంవర్ధక శాఖ ఫోరం జిల్లా కార్యవర్గాన్ని గుడిపేటలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం విజయ భారతి, ఉపాధ్యక్షురాలిగా ఇందిర, కార్యదర్శిగా గంగమల్లు, కోశాధికారిగా సత్యం, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం వారిని సన్మానించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి శంకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి సమక్షంలో ఎన్నికలను నిర్వహించగా, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి అభిషేక్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రతన్, కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

## ఈ-సెట్ కౌన్సెలింగ్‌కు 248 మంది హాజరు

బెల్లంపల్లి, జూన్ 18 : బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ కేంద్రంలో ఈ–సెట్ –2025 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. రెండోరోజు బుధవారం 248 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్, కేంద్రం కోఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. అభ్యర్థుల నిజ ధ్రువీకరణ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు.

## విచారణకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలు

భీమారం, జూన్ 18 : భీమారం ఎస్ఐ కులం పేరుతో దూషించడంతో పాటు, అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, విచారణ లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన భూక్యా రాజు నాయక్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించింది. నెల రోజుల్లో విచారణ చేయాలని రామగుండం కమిషనరేట్‌కు ఆదేశాలు జారీ చేసింది. 30 రోజుల్లో విచారణ చేయాలని, లేకపోతే సివిల్ కోర్టు ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై ఎస్ఐ కే శ్వేతను వివరణ కోరగా, దాంపూర్ శివారు ప్రాంతంలో భూక్యా రాజ్ కుమార్ నాయక్‌తో పాటు, వారి కుటుంబ సభ్యులు అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు అక్కడ బీట్ ఆఫీసర్ భానేష్‌పై దాడి చేశారని ఆయన పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బూర్గుపల్లిలో సపోట గూడెంలో ఓ పెండ్లిలో గ్రామ పెద్ద మనిషి రాజా నాయక్‌పై కుటుంబ సభ్యులు దాడి చేయగా, వారిపై కేసు నమోదు చేశామని వివరించారు. వారు కుటుంబ సభ్యులు చేసే అక్రమ దాందాలు, రౌడీయిజీలకు కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు.

## ఒకరికి 10 ఏళ్ల జైలు

కౌటాల, జూన్ 18 : అత్యాచారం కేసులో కౌటాల మండలం గురుడుపేట గ్రామానికి చెందిన నికాడే నరేశ్‌కు 10 ఏండ్ల జైలు శిక్షతో పాటు, రూ.40 వేల జరిమానా విధిస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురుడుపేట గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతిని నికాడే నరేశ్ ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని వేధించేవాడు. యువతి ఇంట్లో తెలుపడంతో తల్లిదండ్రులు చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తితో 2017, మే 21న పెళ్లి జరిపించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు వేధించాడు. ఈ విషయంలో యువతి భర్తతో పలుమార్లు గొడవలు జరిగాయి. తల్లిగారి ఇంటి వద్ద ఉండగా, 2020, సెప్టెంబర్ 25న రాత్రి 11 గంటల సమయంలో కాలకృత్యాల కోసం బయటకు వెల్లిన యువతిపై నరేశ్ అత్యాచారం చేశాడు. కుటుంబ సభ్యుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు జరుగగా, యువతికి తన భర్త విడాకులు ఇచ్చాడు. అక్టోబర్ 16న తనపై నరేశ్ అత్యాచారం చేశాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి ఏఎస్ఐ శివాజీ కేసు నమోదు చేసి, సీఐలు బీ శ్రీనివాస్, బుద్ధే స్వామి దర్యాప్తు చేశారు. నరేశ్‌ను కోర్టులో హాజరు పర్చారు. పీపీ జగన్మోహన్ రావు, లైనింగ్ అధికారి రాంసింగ్, సీడీవో బాలాజీ సాక్ష్యాలను ప్రవేశపెట్టగా, జడ్జి విచారించారు. నేరం రుజువు కావడంతో నరేశ్ శిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెలువరించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐ విజయ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నేరం చేసిన వారెవరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని, చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

లక్షెట్టిపేట, జూన్ 18 : లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన బిల్లా దేవక్క (59) అనారోగ్య సమస్య భరించలేక బుధవారం ఉ దయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్ఐ గోపతి సు రేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దేవక్క పదేళ్లుగా బీపీ, షుగర్, థైరాయిడ్‌తో బాధపడుతున్నది. దవాఖానల్లో మందులు వాడినా నయం కాలేదు. కాన్సర్ రావడంతో చికిత్స పొందుతున్నది. బుధవారం హైదరాబాద్‌లోని దవాఖానలో చూపించేందుకు వెళ్లాల్సి ఉండగా, కూతురు దావనపెల్లి శ్రీవాణి ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో బంధువులకు చెప్పగా, వారు వచ్చి చూసే సరికి ఉరేసుకొని కనిపించింది వేలాడుతూ చనిపోయి ఉంది. కూతరు శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ఇద్దరి బైండోవర్**

లక్షెట్టిపేట, జూన్ 18 : డయల్ 100కు కాల్ చేసి, పోలీసు విధులకు ఆటంకం కల్గించిన పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కారుకూరి మల్లేశ్, ధనిశెట్టి సతీశ్ ను బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ప్రజలు అవసరానికి కాల్ చేయాలని, అనవసరంగా కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఒకరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జూన్ 18 : వైద్య విద్యార్థునులతో అసభ్యంగా ప్రవర్తించిన చెన్నూర్‌కు చెందిన సంతోష్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల షీ టీం ఎస్ఐ వీ హైమ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కాలేజ్‌రోడ్డులో గల చికెన్ సెంటర్‌లో పని చేస్తున్న సంతోష్, వైద్య కళాశాల విద్యార్థినులు కాలేజ్ నుంచి వెళ్లే సమయంలో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో వచ్చిన సమాచారం మేరకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి, అతడిని పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కానిస్టేబుళ్లు సతీశ్, మహిళా కానిస్టేబుళ్లు జ్యోతి, శ్రీలత పాల్గొన్నారని ఎస్ఐ తెలిపారు.

**దాడిచేసిన నలుగురిపై..**

మంచిర్యాల అర్బన్, జూన్ 18 : మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా ఏరియాలో శ్రీ చైతన్య ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్‌పై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ శ్రీనివాస్ విద్యార్థులను దింపి హాజీపూర్ వైపు నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్నాడు. కాలేజ్ రోడ్డుకు చెందిన కరవేణి మనోజ్, ముత్తునూరి వినయ్, మేకల వెంకట్, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చెందు బైకులపై మంచిర్యాలకు వస్తున్నారు. మార్గమధ్యంలో వారికి హారన్ కొట్టి, ఓవర్ టేక్ చేశాడన్న కారణంతో ఐబీ చౌరస్తాలో బస్సు ఆపి, డ్రైవర్‌పై దాడి చేశారు. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

రెబ్బెన, జూన్ 18 : మండలంలోని గంగాపూర్ చౌరస్తా, గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా, మాదాసు రాజు, కొల్లూరి తిరుపతి వద్ద 2 కిలోల చొప్పున విత్తనాలు లభ్యమైనట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకొని, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఆటో కింద పడి బాలుడి మృతి

బెల్లంపల్లి, జూన్ 18 : పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కాలేగుర రియాన్(6) పాఠశాల ఆటో కింద పడి బుధవారం మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. సుభాషనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సంతోష్‌కు బిడ్డ, కొడుకు రియాన్ ఉన్నారు. రియాన్ బూడిదగడ్డ బస్తీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. రోజులాగే పాఠశాల ఆటోలో ఇంటికి బయల్దేరాడు. డ్రైవర్ నల్లాల రాజేశ్, సుభాష్‌నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒక్కసారిగా టర్న్ చేయడంతో రియాన్ కింద పడిపోయాడు. అతడిపై నుంచి ఆటో వెనుక టైర్ వెళ్లడంతో తల పగిలిపోయింది. వంద పడకల దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.